

# శ్రీ భక్తి సంజీవని

ఇది భక్తి జ్ఞాన కర్మయోగములం దెలుపు మాసపత్రిక.

ప్రతి హూణమాసారంభంబున వెలువడుచుండును.
విలేఖకుండు-ప్రకాశకుండు, వావిలికొలను-సుబ్బరావు,
(వాసుదాసుండు) ఒంటిమిట్ట.

"భక్తిరేవైనం గమయతి, భక్తి రేవైనం దర్శయతి
భక్తివశః పురుషః ॥" మా. శ్రుతి.
భక్తియే భగవంతుని బొందించును, ఆయనను దర్శింపంజేయునది
భక్తియే, భగవంతుండు భక్తివశుండు.



| | | |
|---|---|---|
| సంపుటము<br>6 | 1934వ సంవత్సరము జూ౯ నెల<br>భావనామ సం॥ నిజవైశాఖ మాసము. | సంచిక<br>6 |



భగవద్ధ్యానసోపానము.

సీ. ఇట్టిదట్టి దటంచు నెన్న నసాధ్యమై, యోగుల దృష్టికే
యోగ్యమగుచు । కల జనంబులకిందు సులభసాధ్యంబయి,
సకల ఇహపార లౌకిక సుఖాళి । సంఘటించుచును మోక్ష
ప్రదానంబున, నద్వితీయంబని యశముగాంచి । సర్వదీనా
నాథసంతాప మణంచుచు, దేవతలకునెల్ల దేవుండగుచు ॥
నిగమ పరిషత్తునకు దివ్య నేత్రమగుచు
మెఱుపు గూడిన నల్లని మేఘమనంగ
సీతతో నొంటిమిట్టను దేజరిల్లు
నట్టిదైన యంతర్జ్యోతి యరయు నన్ను ॥

## భక్తివిజయము.

(గతసంచికాశేషము 238వ పుట చూడు.)

శ్లో. సమోహం సర్వభూతేషు, నమేద్వేష్యోస్తి నప్రియః
యే భజంతితు మాంభక్త్యా మయితే తేషు చాప్యహమ్.

నేనందఱియందు సముఁడనే నాకు ద్వేషింపఁదగినవాఁడు లేఁడు. ప్రియుఁడులేఁడు. నాయందు భక్తి గలిగి నాసేవయెవరు సేయుదురో వారు నాయందున్నారు. నేనువారియందున్నాను. నేను భక్తిని బ్రధానముగాఁ జూతునుగాని యితరములేవియుఁ జూడను. అదియుండెనా తక్కి నవి లేవని తలఁపను. అదిలేక తక్కి నవి యుండెనా వానియందుఁ బ్రపన్నుఁడను గాను. అని చెప్పెనుకాని ఇతర మార్గములఁ బోవువారి విషయములన భగవంతుఁ డీమాటచెప్పెనా?

### సుకరము.

భక్తి సాధించుటయందుఁ గష్టములులేవు. సులభము. కర్మసాధనములందు దేశకాలనియమములు గలవు. ఇతరపదార్థములు కావలసియుండును. ఇతరమనుష్యుల సాహాయ్యము కావలసియుండును. జ్ఞాన యోగమునకుఁ బాండిత్యము మేధ యుండవలెను. ఇతర జనసాంగత్యము పనికిరాదు. అష్టాంగ యోగమునకు గురువు సమీపమందుండవలెను. ఏకాంతస్థలము కావలయును. ఆహారాది కఠిననియమములు గలవు. ఈ మొదలైన కష్టము లన్యయోగలంబులఁ గలవు. భక్తి కట్టినిర్బంధములు లేవు. భగవన్నామ ముచ్చరించుటకు నోర నాలుక యుండినఁ జాలును. అదిలేకున్న మనస్సులోనే యనుకోవచ్చును. నమస్కా రమునకుఁ జేతులుండినఁ జాలును. అదిలేకున్నఁ దలతోనో మనస్సులోనో నమస్క రింపవచ్చును. వినుటకుఁ జెవులుండినఁ జాలును. ఈప్రకారము భక్తియోగము సాధించుటకుఁ దన దేహముతప్ప నితరపరికరములతోఁ బనిలేదు.

సీ. దానంబుసేయంగ ధనములు లేవని
వేతనొందఁ బోకుఁడీ వెఱ్ఱు లార
మనసునిల్వదు యోగమును సాధనముసేయ
నని దుఃఖపడకుఁడీ యజ్ఞులార
దేహ మస్వస్థంబు తీర్థ యాత్రల కని
మదిఁ గుందఁబోకుఁడీ మందులార
అధ్యయనము సేయ నధికారి గానని
యంగ లార్పకుఁడు మూఢాత్ములార!
జపములేటికి నో యథా జాతులార
చేయ నేటికిఁ దపము వై ధేయులార
రామ! కృష్ణయటంచుఁ గీర్తనముసేయ
నన్నిచేసిన ఫలమబ్బు నన్నలార!

సీ. పుచ్చినపోఁకైన వెచ్చింపఁబనిలేదు
వాఁకిలి దాఁటెడి పనియులేదు
కదలక కూర్చుండు కష్టంబు నుఁ లేదు
శ్వాసంబు బిగఁబట్టు చావులేదు
బుడికోళ్ళవలె నీటమునుఁగు కార్యము లేదు
నోరెండ వల్లించు తీరులేదు
పొగదాఁకి కన్నులు పోయెడి పనిలేదు
కడుపు గాల్చి శ్రమంబు పడుటలేదు.

గీ. పరుల సాహ్యముఁ గోరుచు వారివెన్క ఁ
బరువుపాఱెడి పనిలేదు భ్రాతలార
నాల్క మీసొత్తు రెండు వర్ణములుపలుక
ముక్తి కన్యక మీ సొత్తు పూజ్యులార!

సీ. ఆటలాడెడి బాలలార మీ బొమ్మల
హరిపేరఁ బిల్వుఁడీ హర్షమునను
గాంతుని వరియించు కన్యకలార శ్రీ
పతిని గామింపుఁడీ భర్తగాఁగఁ
బతిసేవ చేసెడి సతులార మీ సేవ
కృష్ణసేవ యటంచు నెంచరమ్మ
తనయుని నాడించు తల్లులారా వాఁడె
శ్రీ కృష్ణుఁ డని యాదరింప రమ్మ

గీ. భర్తలకు ద్రోహమెంచి పాపంబుసేసి
వారి యాయువు మ్రింగిన వనితలార
యతుల పోలిక వ్రతమూని హరిని సతము
కీర్తనము చేయ ముక్తి తంగేటి జున్ను.

సీ. కామంబు మీయందు ఘనమయి యుండెనా
గోప వధూమణుల్ గుఱుతు మీకుఁ
గ్రోధంబు మీయందుఁ గొనసాగుచుండె నా
శిశుపాలుఁ గొనుఁడు దేశికుని గాఁగ
దారిద్ర్య మింటను దట్టు ముట్టాడెనా
యల కుచేలునిఁ గనుఁ డన్నగాఁగ
ద్రోహంబు మీయందు దోహద మొందెనా
పూతన నెంచుఁడీ మాత గాఁగ

గీ. ద్వేష బుద్ధియు మీయందు విస్తరిల్లఁ
గడఁగుఁడీ సేయ ఘంటికా కర్ణుభంగి
హరికి వనియోగమును జేయ నవగుణంబె
మేటి సద్గుణ మయి చాల మేలుదెచ్చు.

ఆ. బిడ్డపేరు పెట్టి పిలుచుట విశ్రామ
కేలినైన మిగుల గేలినైనఁ
బద్య గద్య గీత భావార్థముల నైనఁ
గమల నయనుఁ దలఁపఁ గలుషహరము.

ఆ. అలుక నైనఁ జెలిమి నైనఁ గామంబున
నైన బాంధవమున నైన భీతి
నైనఁ దగిలి తలఁప నఖిలాత్ముఁ డగు హరిఁ
జేర వచ్చు వేఱుసేయఁ డతఁడు.

వీని వలన భక్తి యెంతసుకరమో తెలియఁగలదు.

మ. యవనవ్యాధ పుళింద హూణ శకకంకాభీర చండాల సం
భవులూ దక్కి న పాపవర్తనలు నే భద్రాత్ము సేనించి భా
గవత శ్రేష్ఠుల దాసి శుద్ధ తనులై కల్యాణులై యుందు ర
య్యవికారుం బ్రభవిష్ణు నాదుమదిలో నప్రశాంతముఁ మ్రొక్కదఁ. భాగ.

గీ. దనుజ భుజగయక్షదైత్య మృగాభీర
సుందరీ విహంగ శూద్ర శబరు
లైనఁ బాప జీవు లైన ముక్తికిఁ బోదు
రఖిల జగము విష్ణుఁ డనుచుఁ దలఁచి.

దీని వలన భక్తి యెట్టివారికైన ముక్తిప్రదమని యేర్పడియె.

**భక్తి నిరపాయము.**

కర్మములందు శాస్త్రవిధికి నేమాత్రము లోపమువచ్చినను హెచ్చుగఁజేసినను వెంద్రుకంత యిటునటుఁ బొరలినను గీడుగలుగును. యోగమందు నట్టులే ప్రాణాపాయమే కలుగును. ఈవిధముగఁ జెడినవారెందఱో గలరు. భక్తియోగమందట్టి యపాయ మేదియులేదు. జ్ఞాన దోష పరిభ్రష్టః చాండాలీం యోనిమాస్థితః. ఛాం. 5-10. జ్ఞానమున దోషముచే భ్రష్టుఁడు చండాలుఁడగును.

**శీఘ్రఫలదము.**

**శ్లో. అనేకజన్మ సాహస్ర తపోధ్యాన (జ్ఞాన) సమాధిభిః**
**నరాణాం క్షీణపాపానాం కృష్ణే భక్తిః ప్రజాయతే**

అనేకవేల జన్మములందుఁ దపస్సు, జ్ఞానము, యోగ సమాధి సాధించి పాపములు క్షయింపఁ జేసికొన్నవారికి విష్ణుభక్తి యుదయించును.

**ఏలయన :-**

**బహూనాం జన్మనా మంతే జ్ఞానవాన్ మాంప్రపద్యతే**
**వాసుదే స్సర్వమితి స మహాత్మా సుదుర్లభః. భ.గీ. 7-19**

అనేక జన్మముల కావలఁ గామముచే హరింపఁబడని జ్ఞానము గలవాఁడై నన్నుఁగూర్చి ప్రపత్తిచేసి వాసుదేవుఁడే నాకు సర్వమని తలఁచుమహాత్ముఁడు మిగుల దుర్లభుఁడు.

దీనివలనఁ గామహతముగాని జ్ఞానము గలిగినపిమ్మటఁ బ్రపత్తి చేయవలయునని యేర్పడుచున్నది. కామదాసునకుఁ బ్రపత్తియేల?

జ్ఞానము మనస్సును బవిత్రము చేయును. కావుననే కామముచే నపహృతమైన జ్ఞానము గలవాఁడో యితరదేవతలఁ గూర్చి ప్రపత్తిచేయునని **'కామైస్తైస్తైహృత జ్ఞానాః ప్రపద్యం తేన్యదేవతాః"** 4-20. భగవంతుఁడు చెప్పెను.

కేవలజ్ఞానము మోక్షమీయఁజాలదు. ఇది మనస్సును బవిత్రము చేయును. పవిత్రమనఁగా **'యజ్ఞోదానం తపశ్చైవ పావనాని మనీషిణామ్."** ఇచ్చట యజ్ఞము దానము తపస్సు పాచీన కర్మములను నాశముచేయుననుట. కావున 'నహిజ్ఞానేన సదృశం పవిత్ర మిహవిద్యతే' జ్ఞానములెఁ బవిత్రము చేయునది మఱియొకటి లేదు.

**యథైధాంసి సమిద్ధోగ్ని ర్భస్మసాత్కు రుతేర్జున**
**జ్ఞానాగ్ని స్సర్వకర్మాణి భస్మసా త్కు రుతే తథా. 4-27.**

మండెడి నగ్ని కట్టెలను గాల్చినట్లు జ్ఞానాగ్ని సమస్త కర్మములను నుపాసనకు విరోధులగు ప్రాచీన కర్మములను భస్మము చేయును.

**సర్వం జ్ఞానప్లవే నైన వృజినం నంతరిష్యసి. 4-36.**

అన్ని పాపములను జ్ఞానమను తెప్పచే దాఁటఁగలవు. ఇన్ని చోటులను భగవంతుఁడు జ్ఞానము మోక్ష ప్రతిబంధక పాపముల హరించు ననియే చెప్పెను. పాపములు పోయినంత మాత్రమున మోక్షమురాదు. రోగము పోయినంత మాత్రమున దేహమునకు బలమురాదు. రసాయనములు తీసికొనవలెను.

ఈ యర్థమునే "తన్నిష్ఠస్య మోక్షోపదేశాత్" నిష్ఠయనఁగా నియతమైన స్థితి, నియతా స్థితి ర్నిష్ఠా నియతంస్థానం నిష్ఠా. ఇది నిష్ఠా శబ్దముయొక్క వృత్పత్త్యర్థము. నియతమైన స్థితి జ్ఞానముగాదు. ఏలన జ్ఞాననిష్ఠ యన్నప్పుడు నిష్ఠాశబ్దమునకు జ్ఞానమని యర్థము చెప్పిన జ్ఞానమునందు జ్ఞానమని చెప్పవలసి వచ్చును. అది పారిహాస్యము. శంకరాచార్యుల వారే యీ నిష్ఠా శబ్దమునకు నేమి యర్థములు వ్రాసిరో చూడుఁడు. భ.గీ. 17-1.

**శ్లో. యే శాస్త్ర విధిముత్సృజ్య యజంతే శ్రద్ధయాన్వితాః**
**తేషాంతు నిష్ఠా కా కృష్ణ సత్త్వమాహో రజస్తమః.**

కృష్ణా! శాస్త్రవిధానము వదలి యెవరు శ్రద్ధతోఁ గూడి దేవునర్చింతురో వారినిష్ఠయేది? సత్త్వమా, రజస్సా తమస్సా" యని యర్థము. ఇచ్చట వారినిష్ఠయేది యనుటకు యాతేషాం దేవాది విషయపూజా సా కిం సాత్త్వికీ అహోస్విత్ రాజసీ ఉతతామసీ' ఇతి యని నిష్ఠియనుటకు దేవాది విషయ పూజయని వ్రాసిరి. ఇది భక్తియగును గాని జ్ఞానము కాదుగదా.

అట్టులే భ-గీ. 18-50.

నిష్ఠా జ్ఞానస్యయాపరా' అనువాక్యమునకు జ్ఞానమునకుఁ బరనిష్ఠయని యర్థము. ఇచ్చట నిష్ఠా = పర్యవసానం పరిసమాప్తిః' అని వ్రాసిరి. దేనివలన జ్ఞానము పరిసమాప్తి చెందునన జ్ఞానమువలన జ్ఞానము పరిసమాప్తిచెందుననుట యవ్యక్త ప్రలాపము. జ్ఞానమునకుఁ బర్యవసానము మీఁదఁజెప్పినట్లు శ్రద్ధా భక్తులతోనే యనవలయును. నిష్ఠాశబ్దమునకు భక్తి యనియు నర్థముగలదు. వెలుతురురాఁగానే చీఁకటిపోయినట్లు జ్ఞానోదయము కాఁగానే అవిద్య నశించును. అదియే మోక్షమని యద్వైతులవాదము. వ్యుత్పత్త్యర్థమును గ్రహించినను దానికి భంగమే కలదు.
మఱియును భ-గీ. 3-3 నందు,

**లోకేస్మిౝ ద్వివిధానిష్ఠా పురాప్రో క్తామయానఘ**
**జ్ఞానయో గేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్.**

ముందు నీకు రెండువిధముల నిష్ఠలు చెప్పితిని. జ్ఞాన యోగులకు సాంఖ్యనిష్ఠ, కర్మయోగులకుఁ గర్మనిష్ఠ. ఇచ్చట నిష్ఠా శబ్దమునకు స్థితియని శంకరాచార్యులవారు వ్రాసిరి. స్థితి జ్ఞానముగాదు. కావునను నిష్ఠా శబ్దమునకు జ్ఞానమను నర్థములేదు కావున 'తన్నిష్ఠస్య మోక్షోపదేశాత్' బ్రహ్మ. సూ. 1-1-7. అను బ్రహ్మసూత్రమునకు 'అట్టినిష్ఠగలవానికి మోక్ష ముపదేశింపఁబడె ననుచోట నిష్ఠయనఁగా శ్రద్ధగాని భక్తిగాని ధ్యానముగాని చెప్పవలయును. శ్రద్ధ = విశ్వాసము. అది స్వతంత్రించి మోక్షమీయఁజాలదు. ఈ సూత్ర వ్యాఖ్యయందు శంకరాచార్యులవారు, ఛాం. VI-142 నందు వ్రాసిన గాంధారపాంథుఁడును మార్గమొకఁడు చెప్పఁగానే గాంధార దేశమందుండినవాఁడు కాఁడు. కావున జ్ఞానము కలుగఁగానే గమ్యస్థానము చేరఁడు.

అట్లులే జ్ఞానమువలనఁ బాపములు క్షయింపఁగాఁ బ్రపత్తిచేసి ముక్తుఁడు కావలెను. ముందు జీవునకు స్వరూప జ్ఞానము కలుగవలెను. ఆవలఁ బ్రపత్తి జేయవలెను. ఆవల ముక్తుఁడు గావలెను. ఇఁక యోగమందమా.

**ప్రయత్నాద్యతమానస్తు యోగీ సంశుద్ధ కిల్బిషః**
**అనేకజన్మ సంసిద్ధస్తతో యాతి పరాంగతిమ్.**

ప్రయత్నపూర్వకముగ యోగవిషయమున యత్నము చేయుయోగి యనేకజన్మముల సంసిద్ధిచేఁ బాప రహితుఁడై యావలఁ బరగతిని బొందును.

దీనివలన నిది యనేక జన్మముల కార్యమని యేర్పడుచున్నది.

ఇఁక భక్తినిగుఱించి యేమి చెప్పఁబడెనో చూతము.

**చం. తనకుల ధర్మముౝ విడిచి దానవవైరి పదారవిందముల్**
**పనిపడిసేవచేసి పరిపాకమునొందక యెవ్వఁడేనిఁ జ**
**చ్చిన మఱుమేన నైన నది సిద్ధి వహించు"భాగ.**

ఈ జన్మమున భక్తియోగము ప్రారంభించి దానిఫలము సిద్ధించుటకుఁ జాలినంత సాధింపకముందే మరణించెనేని మఱుజన్మంబున జన్మమాదిగఁజేసి ఫలసిద్ధిఁ బొందును.

**శ్లో. యేతు సర్వాణి కర్మాణి, మయి సన్న్యస్య మత్పరాః**
**అనన్యేనైవ యోగేన, మాంధ్యాయంత ఉపాసతే.**
**తేషా మహం సముద్ధర్తా, మృత్యు సంసార సాగరాత్**
**భవామి నచిరా త్పార్థ మయ్యావేశిత చేతసామ్.**

సమస్తకర్మముల భారము ఫలము నాయందుంచి (భరన్యాసము గావించి) నేనే తమకుఁ బరమగతిగాఁ దలఁచి యనన్యమైన భక్తియోగముచే నన్నెవఁడు ధ్యానము చేయునో, యుపాసించునో, యట్టి తనమనస్సు నాయందుంచిన వానిని మృత్యురూప సంసారమునుండి నేనే శీఘ్రముగ నుద్ధరించెదను.

ఇందు భక్తరక్షణభారము తనయందే కలదని భగవంతుఁడు చెప్పెను. మహానారాయణో పనిషత్తులోఁ జెప్పఁబడిన దీవిషయమే కదా.

ఓయి నీభక్తియోగ మపాయముతోఁ గూడినదే. అనత్కా లమందు సహాయపడఁజాలదు. ఏలయందువా?

**యంయం వాసి స్మరౝ భావం, త్యజత్యంతే కళేబరమ్**
**తం తమేవైతికౌంతేయ, సదా మద్భావ భావితః.**

అంత్యకాలమున నెవఁ డేయేరూపము స్మరించుచు దేహమును విడుచునో యట్టివాఁడు మరణానం

తరమున నట్టి రూపమునే ధరించివాఁడగును. నారూపము స్మరించుచుఁ బ్రాణము విడిచినవాఁడు నారూపము ధరించువాఁ డగును. వాఁడు జీవితకాలమందు సర్వదాభావించుచుండిన విషయమే యభ్యాసవశమున నంతిమ ప్రత్యయము (మరణ కాలమందలి స్మరణము) నందును గలుగునుగాని వేఱొక్క టిరాదు. ఇల్లు కాలునపుడు బావిత్రవ్వద మనుకొనక మరణకాలమందు స్మరించినఁ జాలునులే యనియుండక జీవిత కాలమందే భగవద్రూప స్మరణము చేయుచుండవలయు నని గదా భగవద్గీత చెప్పుచున్నది. సత్యమే.

ఒకఁడు యావజ్జీవము భగవన్నామ స్మరణము చేయుచు భగవద్రూపమును ధ్యానించుచుండును. వానికి మరణకాల మాసన్నమైనది. కంఠవాయువుచేతనో, కఫ వాత పిత్తముల బలముచేతనో భగవన్నామము నోరరాదు. రూపము జ్ఞప్తికిరాదు. అట్టివాఁడు యాజ్జీవము చేసినది వ్యర్థమేకదా.

అయ్యా! నీవు **"నమేభక్తః ప్రణశ్యతి"** నా భక్తుఁడు చెడఁడు. **"నహి కల్యాణకృత్క శ్చిత్ దుర్గంతి తాతగచ్ఛతి"** శుభకార్యము చేయువాఁడు నాయనా! యెన్నఁటికి నరకమునకుఁ బోఁడు. **'నవాసుదేవ భక్తానా మశుభం విద్యతేక్వచిత్'** వాసుదేవ భక్తులకుఁ గీడురాదు.

ఇత్యాది పరశృత ప్రమాణము లాలోచింపక ప్రశ్నించిన నేనేమి చెప్పుదును.

భక్తియోగ మభ్యసించువానికి నంతిమ స్మరణ మావశ్యకమే. కాదనను. ప్రపన్నునకది యనావశ్యకము. భక్తునివిషయమున నీవుచెప్పిన సందర్భములందు భగవంతుఁడే వానికి నంతిమ స్మరణము కలుగఁ జేయును. కావున భక్తియుఁ జెడదు. భక్తుఁడు చెడఁడు. ఎట్లన :-

**"జ్ఞానసమకాల ముక్తా్వ, కైవల్యం యాతి గతశోకః ।**
**తీర్థే శ్వపచ గృహేవా, నష్టస్మృతి రపి పరిత్యజ దేహమ్**
**శరీరపాత సమయేతు కేవలం, నుదీయైవ దయయా ప్రబుద్ధో**
**మామేవా లోకయ , అప్రచ్యుత పూర్వసంస్కా ర మనోరథః ॥**

నా భక్తుఁడు తీర్థమందో మాలవాని యింటియందో స్మృతితప్పి దేహము విడిచినను శోకరహితుఁడై మోక్షమునకుఁ బోవును. శరీరము పడిపోవు సమయమందుఁ గేవలము నాదయచేతనే (వాని ప్రయత్న మేమిలేకయే) జ్ఞానము కలవాఁడై కన్నులకెదురుగా గోచరించు నన్నేచూచుచుఁ బూర్వ సంస్కా రముచేఁ గలిగిన కోరికచేత మోక్షమునకుఁ బోవును. కావున నీవు చెప్పిన కష్టదశయందు భగవంతుఁడు తనకుఁ దానే యాభక్తుని యెదుట తనస్వరూపము గానవచ్చునట్లు చేయును. కావున నీవుచెప్పిన కష్టదశయందు భగవంతుఁడు తనకుఁదానే యాభక్తుని యెదుట తన స్వరూపము గానవచ్చునట్లు చేయును. కావున నాయన స్మరణము సుకరముగ లభించును. తన ప్రయత్నమేదియు నక్క అలేదు. జీవించి యుండువఱకే వాని ప్రయత్నము. ఈవిషయమున నింకను బ్రమాణములు గలవు.

**యంహిరక్షితు మిచ్ఛంతి, బుద్ధాసంయోజ యంతితమ్**
**రక్షతే భగవాన్ విష్ణుః భక్తా నాత్మశరీరవత్.**

ఎవనిని భగవంతుఁడు రక్షింపవలయునని తలఁచునో వానికిఁ దనమీఁది భక్తికలిగించును. భగవంతుఁడగు విష్ణువు భక్తులను దనశరీరమును దాను రక్షించుకొనునట్లు రక్షించును. భగవంతుఁడెవరిని రక్షింపఁగోరునో వానియందే భక్తియుదయింపఁ జేయును. జీవితదశయందిట్లు కాపాడినవాఁడు కష్టకాల మందు జేయివిడుచునా?

**తేషాం సతతయుక్తానాం, భజతాం ప్రీతి పూర్వకమ్**
**దదామి బుద్ధియోగం తం, యేన మాముపయాంతితే. భ-గీ. 10-10.**

సర్వదా నాతోడ నుండవలయునని కోరిక గలవారికి ఆకారణముచేఁ బ్రీతితో నన్ను భజించువారికి దేనిచే వారు నన్నుఁ బ్రాప్తింతురో యట్టిబుద్ధి వారికి నేను గలిగింతును

**అశక్త మపిచన్మర్తు, మంతే పూర్వకృతం స్మరో**
**స్వయమేవ పరంధామ, స్వయం నయతి మాధవః**

**భారద్వాజసంహిత.**

మరణకాలమందు నన్ను స్మరించుటకుఁ గూడ శక్తిలేని నాభక్తుఁడు తత్పూర్వము జీవితకాలమందుఁ జేసిన భజనము స్మరించి నారాయణుఁడు తనలోకమునకుఁ దానే తీసికొని బోవును.

ముకుందమాలయందు,

**"చరణౌతేమరణేపి చింతయామి"** నీ పాదద్వంద్వమును మరణకాలమందును స్మరింతుననిచెప్పి

పొరపడితినని గ్రహించి

**"కృష్ణ త్వదీయ పంకజ పంజరాంత**
**మద్యైవమే విశతు మానసరాజహంసః**
**ప్రాణ ప్రయాణసమయే కఫవాతపిత్తైః**
**కంఠావరోధన విధౌ స్మరణం కుతస్తే.**

స్వామీ! నీ చరణ పంకజములను పంజరమునందు నా మానసమను హంస యిప్పుడే ప్రవేశింపనిమ్ము. ప్రాణము పోవు సమయమందుఁ గఫవాతపిత్తములు కంఠము నడ్డగించినపుడు నీనామ స్మరణ మెక్క డిది?

అని కుల శేఖరాళ్వారులవారు సెలవిచ్చిరి.

**(సశేషము.)**

## శ్రీరామ సుగ్రీవ సంవాదము.

**సుగ్రీ :–** రామచంద్రా! శరణాగతుఁడగు ప్రపన్నుని రక్షింపవలసినది విధియని శ్రుతిస్మృతి శిష్టాచార ప్రమాణములను స్వప్రియమును దానికారణములను జెప్పితివి. అంగీకరించితిని. శాస్త్రవిరుద్ధముగ శిష్టాచార విరుద్ధముగఁ బొమ్మని నేను జెప్పను గాని

**"నీవాఁడని యొకపరియే**
**యేవాఁడే౯ శరణువేఁడునేని సకలభూ**
**తావళి కభయంబును నే**
**వావిరి ఘటియింతు నిదియ వ్రతమగునాకు౯**

అని చెప్పితివే ఆవిషయమున నాకుఁగొన్ని సందేహములు గలవు. అడుగుదునా?

**రామ :–** నీవు వినయవిధేయతలతో జిజ్ఞాసువై యడిగినపుడు నేనేల చెప్పకుందును? అవశ్యమడుగుము.

**సు :–** నీవాఁడని విభీషణు నంటివే, ఆయన నీకుఁ దండ్రిగాఁడు. దోడఁబుట్టినవాఁడు కాఁడు. తుదకు సజాతీయుఁడుకూడఁ గాఁడే వాఁ డామాట యనుటెట్లు? నీవు దాని నంగీకరించుటెట్లు?

**రామ :–** నా వస్త్రమని నీవనెదవే. అదినీకుఁ దల్లియా, తండ్రియా, దోడఁబుట్టువా, నీ సజాతీయమా?

**సు :–** నేను ధరించువాఁడను. అది ధరింపఁబడునది. ఆసంబంధముచే నావస్త్ర మందును.

**రామ :–** మఱియొకరి వస్త్రమును నీవొకసారి ధరించి విడుతువేని దానిని నావస్త్రమందువా?

**సు :–** అనను. అది నియతముగ నాసొత్తుగాదు. దానియందు నాకు నిత్యస్వామిత్వము లేదు.

**రామ :–** అట్టులే నీవాఁడన్నప్పుడును నీవు స్వామివని నీసొమ్మునేనని, నీవు రక్షించువాఁడవని, నేను రక్షింపఁబడవలసిన వాఁడవని, ఈసంబంధము మనయందు నిత్యమని యర్థము. ఇట్టి సంబంధము గలచోటనే నీవాఁడు నావాఁడు అను శబ్దములు ప్రయోగింపఁబడును. నాయందు విభీషణుఁ డట్టి భావము గలవాఁడు కావున నీవాఁడనెను.

**సు :–** రామచంద్రా! నీవు చెప్పినది తృప్తికరముగా లేదు. విభీషణుఁడు ఇక్క డ నీవాఁడను అనినది నిజమే. వీఁడే నేను రావణుని తమ్ముఁడ ననలేదా? నాభార్యను బిడ్డలను అనలేదా? అవి యావజ్జీవ ముండుసంబంధ ములే కదా? దీనికి దానికేమి భేదమున్నది?

**రామ :–** నీవు చెప్పినది సత్యమే. విభీషణుఁడు లంక విడుచు వఱకు రావణుఁడు రక్షకుఁడు తాను రక్ష్యుఁడు అను భావముండినది. ఆభావమే యిప్పుడున్న నిచ్చటికేలవచ్చును? వానిని విడిచికదా నాయొద్దకు వచ్చినాఁడు. తన్నుఁదాను రక్షించుకొనఁగల ననికాని భార్యలు బిడ్డలు రక్షింతురని కాని ధైర్యముండినచో వారినందఱ విడిచి నాయొద్దకు వచ్చునా? విభీషణునకు రావణునందు స్వామి భృత్యన్యాయము స్వస్వామిత్వ న్యాయము రక్షరక్షక భావము పూర్వముండినది యిపుడులేదు. తన్నుఁదాను రక్షించుకొనఁగలనని స్వాతంత్ర్య ముగాని యితరులు తన్ను రక్షింతురని పరపారతంత్ర్యముగాని యున్నయెడల వారిని నేను జేరఁదీయను.

**సుగ్రీ :–** ఒకపరియే యంటివే. పలుమాఱు చెప్పుకొన్న దోషమా?

**రామ :– "దొఱసితి నీదు చెల్మి మన దుఃఖసుఖంబులు పొందెనైక్యము౯"** దినదిన మామాట నీవు చెప్పుచు న్నావా? ఏల చెప్పవు?

**సు :–** నేను నీస్నేహితుఁడవని నీవు దృఢముగ విశ్వసించితివి. నీవు నామిత్రుఁడవని నేను నమ్మితిని. తెలిసిన విషయము మరల మరలఁ బ్రస్తావింపనేల? నీవు మఱచినఁగదా నేను బ్రస్తావింపవలె.

**రామ :–** ఆకారణముచేతనే ప్రపత్తి పలుమాఱు చేయరాదు. ప్రపత్తియనఁగాఁ బ్రకృష్టజ్ఞానము. నేనుసుహృత్తు, శేషి, రక్షకుఁడు, స్వామియనియుఁ దాను భృత్యుఁడు, రక్ష్యుఁడు సొమ్ము అనుజ్ఞానము. విభీషణుఁడు నావాఁడని నేను గ్రహించితిని. నేను మఱచిపోయినఁగదా ఆయన పలుమాఱు హెచ్చరింపవలె. నాయందు జ్ఞప్తిబలము గలదని మీరే చెప్పితిరిగదా. (చూడు. 342) సీతాదేవియు,

గీ. **"కంటికెదుర నున్నఁ గడుఁ బ్రేమ గలుగును**
**మఱుఁగు పడిన మైత్రి మఱపు గలుగుఁ**
**దథ్య మిద్దియగుఁ గృతఘ్నులయం దెదఁ**
**బ్రేమ మఱవఁడెపుడు రామవిభుఁడు".** **సుం. 678.**

అని చెప్పినట్లు హనుమంతుఁడు మీకుఁ జెప్పెఁగదా. నీభార్యవచ్చి ప్రతిదినము నేను నీ భార్యను అని నీకొడుకువచ్చి నేను నీకొడుక నని నీ మంత్రులువచ్చి మేము నీ మిత్రుల మని ప్రతిదినము చెప్పుచుండ వలయునా? అట్లు చెప్పిరేని నీ వేమనుకొందువు? ఉపచారము స్నేహము కుదురువఱకే. స్నేహము దిటపడిన తరువాతఁ జేయు నుపచారము కైతవము. కావున ప్రపన్నుఁడు నీవాఁడను అని యొకసారి చెప్పి యావిషయ మును మనస్సునందుంచుకొని యాభావముతో స్వధర్మమునఁ బ్రవర్తించుచుండినఁ జాలును.

**సుగ్రీ :–** రామచంద్రా! ఒకపరియే యంటివిగదా అవధారణార్థకమైన **'ఏ'** కారము నీవాఁడనే అను ప్రపత్తి వాక్యముతోఁజేరునా? రెండుమూఁడుసార్లు చేయరాదని యొకపరియనుదానితోఁ జేరునా? ప్రపత్తిచేసిన వానినే రక్షించెదను. ఇతరుల రక్షింపవంటివా. అభయం గతోభవతి యని ప్రపన్నుఁడుకాని భక్తినిష్ఠునకు నభయప్రదానమును బ్రతిపాదించు శ్రుతివాక్యమునకు విరోధించుచున్నది. అదియునుగాక వీనియందుఁ బ్రపన్నత్వ మున్నదా లేదా? యని తర్కించి సందేహము నివారించి వీనియందుఁ గలదని నీవు నిర్ధారింప లేదుగదా.

అటుగాక ఒకపరియే యభయంబు ఘటియింతును పలుమాఱు ఘటింపను అనితివా యిదివఱకే వచ్చిపోయిన భయముల విషయమై నీవు చేయఁగల దేదియులేదు. ఇఁక రాఁడోవునవి యేవేని వచ్చునో యెన్నివచ్చునో వానికిఁగా నీవిపుడు చేయఁదగినదిలేదు. అవి వచ్చినపుడు చేయవలసిన కార్యముగా నుండును. కావున దేనితో 'ఏ' కార మన్వయింపవలెనని నీ యభిప్రాయము.

**రామ :–** ప్రపత్తి యొకసారి చేయవలయుననియే నాయభిప్రాయము. ఒకపరియే యనునది మఱియొక విధముగా నన్వయింపవచ్చును. ఒకపరియే నిశ్చయించుకొని శరణువేఁడెనని మధ్యమపదలోపిగా నన్వయింప వచ్చును. అనఁగా రక్షణమందు మనవలె నూహాపోహములకుఁ బాలుపడక చేయుదమా వలదాయని యాలోచింపక తటాలున నిశ్చయించుకొని వచ్చినాఁడనవచ్చును. ఇది మహావిశ్వాసమును సూచించును.

**సుగ్రీ :–** ఏవాఁడే నంటివే. ఒకఁడు పరమపాపి, పుట్టినది మొదలు క్రూరకార్యములు చేయువాఁడు, దయా దాక్షిణ్యము లెఱుఁగఁడు, పరద్రోహి, ఘాతుకుఁడు. అట్టివాఁడు నీవాఁడ ననఁగానే రక్షింతువా?

**రామ :–** అవశ్యము రక్షింతును. వాఁడు పరమపాపి, యని నీ వంటివేకాని వాఁడు పూర్వజన్మమందు నీ విషయమై యేదియో పుణ్యకార్యము చేసియుండి యది ఫలించు కాలము వచ్చుటచేతనే వానికి నేను జ్ఞప్తికివచ్చుటే గాక నీవాఁడను అన నోరువచ్చినది. వానిపాపములు హరించి పోయి బాగుపడుకాలము రాకుండిన వానినోర నామాట రానేరాదు. పాపములన్ని హరించి బాగుపడు కాలము వచ్చుటచేతనే వాఁడు ప్రపన్నుఁడై నేను నీవాఁడ ననఁగలిగెను. వానికాబుద్ధి తేరకు నిష్కారణముగా వచ్చెనా? పూర్వసుకృతఫలముగా వచ్చెను. లంకలో నందఱు రాక్షసు లున్నవారుగదా. విభీషణుఁడుతప్ప మఱియెవ్వఁడైన వచ్చెనా? విభీషణున కైనను దల్లిదండ్రుల యొద్దకో కుబేరుని యొద్దకో పోదమని బుద్ధిపుట్టక యిక్కడకి రావలయునని యేల బుద్ధిపుట్టెను?

కావునఁ బాపములన్నియు హరించుకాలము వచ్చిన వాఁడే ప్రపత్తిచేయును. తక్కినవారికి నీవు చెవులలో శంఖములు పెట్టి ప్రపత్తిప్రపత్తి యని యూఁదినను వినరాదు. విభీషణుమాటలేల రావణుని చెవి కెక్క లేదు. అవి విష ప్రాయములుగా వానికిఁదోఁపలేదా. కావున శరణాగతుఁడైన వానిని బాపాత్ముఁడ వందువేని నీవే పాపాత్ముఁడ వగుదువు. ఏలన :– 'తస్యానుబంధః పాప్మానః సర్వేనశ్యంతి తత్క్షణాత్' భగవంతునకుఁ బ్రపన్నుఁడైన క్షణమందే వానినంటియుండిన ఆగామి సంచితపాపములు వాఁడంగీకరింపని ప్రారబ్ధములు నశించును. కావున వాఁడు పాపాత్ముఁ డెట్లగును? పాపుఁడు కానివానిని బాపుఁడనుటయే మహాపాపము.

**సు :–** అట్లైన దీనికి జాతి నీతి యక్క ఱలేదా?

**రామ :–** ఏజాతివాఁడైనను ఏనీతివాఁడైనను పురుషులైనను స్త్రీలైనను బాలురైనను వృద్ధులైనను శరణాగతులు కావచ్చును ఆయూరు మాది యీయూరు మీది. అని యా యీ యూళ్ళవారు చెప్పుదురు. చక్రవర్తితో? ఇది శనివారము ఆది మంగళవారమందురు. సూర్యునతో? వారిలో వారికిబేధబుద్ధి యుండినను దల్లిదండ్రులకు బిడ్డలందఱు సమానులే కదా.

**సు :–** వేఁడునేని యంటివే. ఒకఁడు నీయొద్దకు రాలేక తానున్నచోటనే యుండి శరణుచేయును. మఱియొకఁడు మనస్సులోనే తలఁచును. వారినిగూడ రక్షించెదవా?

**రామ :–** నీవాఁడను అని వాక్కు తో ననవచ్చును. దానికి శక్తిలేకపోయిన మనస్సుతో ననుకొనవచ్చును. అట్టివానిని నేను బోయి రక్షింపవలసిన కార్యమైన నేనే పోదును. సంకల్పముచేఁ జేయఁదగినదైన నట్టులేచేయుదును. విభీషణుఁ డిక్క డికిరాక లంకయందుండి శరణు అనియుండిన నేనే యక్క డికిఁబోయి రక్షించియుందును. వాఁడే యిక్క డికివచ్చి నాకెంతో సాహాయ్యము చేసెను. అట్టివానిని నేనెట్లు విడుతును?

**సు :–** రామచంద్రా! నీకు నల్లనివన్ని నీళ్ళు తెల్లనివన్ని పాలు నీవలెనే యితరు లనుకొనుచున్నావు. చేతులు జోడించినదే చూచి ప్రపన్నుఁడనుకొంటివి గాని చంకదుడ్డు శరణార్థియనుమాట నిజముగా వానిచంకలో నేమున్నదో చూడుము. ప్రపన్ననకు గదయేల?

**రామ :–** కామలారోగికిఁ బాలు శంఖముకూడఁ బసువుగానే కానవచ్చును. నీవు దోషబుద్ధి చూచుచుండుటచే నీకు గుణము దోషముగాఁ గానవచ్చుచున్నది. నీయొద్దఁ గొలువుచేయ నొకవడ్రంగి వచ్చెననుకో. వాఁడు బాడిసె ఉలి గూటము దెచ్చిన నవి నిన్నుఁజంపుటకా? అట్టులే యితఁడు క్షత్రియుఁడు, క్షత్రియవృత్తి నుండువాఁడు, యుద్ధకాలమున మనసేవ చేయవచ్చినాఁడు. ఇట్టివాఁ డుత్తచేతుల వచ్చెనేని యెట్లు సేవ సేయఁగలఁడు. కావున దానికిఁ గావలసిన కొఱముట్లు తెచ్చుకొన్నాఁడు. అది దోషమా? నాకుఁ బాలు తెల్లగాఁ గానవచ్చుచున్నవి. నీకు నల్లగాఁ గానవచ్చుచున్నవి.

**సు :–** సకలభూతావళికంటివే. ఒకఁడు ప్రపత్తిచేసిన లోకములో నందఱు రక్షింతువా?

**రామ :–** ప్రపత్తి చేసినవానినేకాక వానికి సంబంధించి వాని ననుసరించి వానియందుఁ బ్రేమగలిగి వానిప్రేమకుఁ బాత్రులైన యందఱను వానిపశువులను పక్షులను మృగములను మనుష్యులను నందఱను రక్షింతును విభీషణుఁడు మాత్రమే కదా శరణనెను వానితోడ వచ్చినవారినిగూడ రక్షింతును వారు ప్రత్యేకించి చెప్పుకొనవలసిన పనిలేదు వానితోడ నుండినఁజాలును. సుగ్రీవా! నీమంత్రులు నీయొద్దఁ గొలువు చేయుచున్నారు. కాని వారి భార్యలు బిడ్డలు సేవకులు నీయొద్దకువచ్చి సేవచేయుటలేదు. నీ ముఖమైన వారెఱుఁగుదురో యెఱుఁగరో. అట్లుండియు నీవు మంత్రుల రక్షణమునకై యిచ్చునవి యన్నియు వారనుభవించుచున్నారుగదా. వారిని నీవు రక్షించినవాఁడ వగుచున్నాఁడవుగదా. కాఁపులయింట దున్ని విత్తి పైరుపెట్టి కాచి కోసి ధాన్యము తెచ్చువాఁడొకఁడే. ఆ ఫలము నంద ఱనుభవింతురుగదా. అట్టులే నా విషయమునఁ బ్రపత్తిచేసినవాఁ డొకఁడే యైనను వాఁడు భరింపవలసిన వారినందఱు నేనే భరింపవలయును. భరింతును. భరన్యాసమనఁగానేమి. వారిభారములన్నియు నామీఁద వేయుటే కదా.

(శ్రీమద్రామాయణము "వేదోప బృంహణార్థాయతా మగ్రాహయత ప్రభుః" అని వేదోపబృంహణార్థము వాల్మీకి బాలుర గ్రహించెనని రామాయణమందే చెప్పఁబడెను వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా' యనియుఁ గలదు. వేదోపబృంహణమనఁగా వేదార్థమును విశదీకరించుట యని యర్థము. అటయినచో రామాయణ మేవేద వాక్యముల యర్థమును విశదీకరించు చున్నది. అను ప్రశ్నరాఁగా "తగ్ంహ దేవ మాత్మ బుద్ధిప్రసాదమ్ ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే" ముముక్షువగు నేను బుద్ధిప్రసాదమును గలిగించు భగవంతుని శరణు చొచ్చెదను. "ప్రయతపాణిః శరణమహం ప్రపద్యే" పరిశుద్ధ హస్తుఁడనైన నేను శరణుచొచ్చెదను. "స్వస్తి సంబాధే ష్వభయన్నోస్తు" సంకటములందు మనకు అభయము కలుగునుగాక అని ప్రపత్తిని విధించు వేదవాక్యములను రామాయణము విస్తరించి చెప్పుచున్నది. పరిశుద్ధ హస్తములతో శరణుచేసెద నన్నప్పుడు అభివాదన రూపక (నమస్కా ర) ప్రపత్తి చెప్పఁబడెను. చరణౌ శరణమహంప్రపద్యే యని ద్వయమందుఁ గలదుగదా. లక్ష్మణుఁడు రామచంద్రమూర్తి పాదములు పట్టుకొనికదా శరణాగతుఁ డయ్యెను. పరిశుద్ధహస్తుఁడనఁగా నీళ్ళతోఁ జేయికడుగుకొని యనిమాత్రమె యర్థముకాదు. "సర్వధర్మాన్ పరిత్యజ్యమామేకం శరణం వ్రజ" మోక్ష సాధనముల నన్నిటిని వదలి నన్నొకనినే శరణుచొరుము. అనియు "పితరం మాతరం దారాన్ పుత్రాన్ బంధూన్ సఖిన్ గురూన్ । రత్నాని ధనధాన్యాని క్షేత్రాణిచ గృహీణిచ"

“సర్వధర్మాంశ్చ సంత్యజ్య సర్వ కామాంశ్చ సాక్షరా౯ । లోకవిక్రాంత చరణౌ శరణంతే ప్రజం విభో” ఇతర యుపాయములను వానికి సహకారులైన తండ్రి తల్లి భార్య బిడ్డలు బంధువులు మిత్రులు వేఱుపాయముల నుపదేశించు గురువులు రత్నములు ధన ధాన్యములు గృహక్షేత్రములు సాంగములైన కర్మయోగ, జ్ఞానయోగ, అష్టాంగయోగా ద్యుపాయములు ఐహికసుఖములు స్వర్గభోగములు ఆత్మానుభవరూపమైన కైవల్యము వీని నన్నిటిని వదలి (వీరియందు రక్షక భావము భోగ్యభావము మమకారము వదలియని భావము.) నీపాదముల శరణుచొచ్చితి నన్నట్లు కర్మ, జ్ఞాన, భక్త్యాదులందు నుపాయబుద్ధిని నైహిక సుఖములయు స్వర్గకైవల్య సుఖములయుఁ గాంక్షను బూర్ణముగ వదలి నిర్మల మనస్సు గలవాఁడై యనియు నర్థము. శరణం ప్రపద్యే శరణుచొచ్చుచున్నా ననునది శరణంబు చొచ్చితి౯, నన్ను శరణంబు జొరుము. ప్రార్థించు మనస్సే శరణాగతి యను పదములచేఁ దెలుపఁబడెను.

ఈ శ్రుతి వాక్యమునకు నుపబృంహణ మెట్లన :-

ఒక పరియే యనుపదము “ఆవృత్తిరసకృదుపదేశాత్” బ్ర. సూ. మున చెప్పినట్లు పలుమాఱు ఆవర్తి నపేక్షించు భక్తి విషయమై యన్వయింపక సర్వధర్మ త్యాగ పూర్వకమైన ప్రయతపాణి యనుపదము నర్థమును వివరించుచున్నది. ప్రయతమనఁగాఁ బరిశుద్ధము “పవిత్రః ప్రయతః పూతః” అమరము. ప్రకర్షణే యచ్ఛతి = స్వవిషయేభ్యః ఉపరమత ఇతి ప్రయతః” అని ప్రయత శబ్దమునకు వ్యుత్పత్త్యర్థము. స్వరూప విరుద్ధవిషయములనుండి యింద్రియములను బూర్ణముగ మరలించుట ప్రయతమనఁబడును. ఉపాయాంత రములు కర్మజ్ఞానాదులు భగవదేక పారతంత్ర్యమునకు విరోధులు, స్వరూప నాశకములు గావున భగవదుపా సన వఱకుఁగల యుపాయములన్నియు స్వరూపవిరుద్ధములే. కావున వానిని వాసనతోడ విడిచినవాఁడే ప్రయతపాణి యనఁబడును. పాణియను శబ్దము భగవన్నామ సంకీర్తనమున కుద్దేశింపఁబడి యుపయోగపడు వాగింద్రియమును భగవద్దివ్యమందిర ప్రదక్షిణమున కుపయోగపడు పాదములకు నుపలక్షణము. ఒకపరియే శరణాగతి చేయవలయు ననుటచేఁ దైలధారవలె నిరంతర ధ్యాన రూపమైన జ్ఞానము భక్తి దీనినుండి దూరముగఁ ద్రోయఁబడినది. అట్లే శరణువేఁడెనేని యనుపదముచే శరణం ప్రపద్యే యనుపదమును నీవాఁడని శరణువేఁడు ననుపదముచే స్వస్త్యస్తు అనుపదమును అభయంబు ఘటింతు ననుటచే అభయ మస్తు అనుపదములను నర్థమును విశదీకరించుచున్నది. ఈవిధముగ నీ పద్యము శరణాగతి విషయమైన వేదసూక్తుల యర్థమును వివరించెను.

మఱియు నీ వేదసూక్తులందు శరణంప్రపద్యే శరణుచొచ్చుచున్నాను అని యేకవచనముతోఁ బ్రారంభించి అభయం నః అస్తు = మా కభయము కలుగునుగాక యని బహువచనముతో ముగిసెను. ఇట్టులే “వైష్ణవోనః కులేజాతః’ మావంశమందుఁ బుట్టిన వైష్ణవుఁడు మమ్మందఱ నుద్ధరించును. ‘తే సర్వే ముక్తి మాయాంతి’ ఆవంశమునఁ బుట్టిన వైష్ణవుని వలన వారందఱు ముక్తిపొందుదురు. అని చెప్పఁబడెను. “అట్టులే యేచవైష్ణవ సంశ్రయాః । తేనైవతే ప్రయాస్యంతి । తద్విష్ణోః పరమం పదమ్” వైష్ణవుని నాశ్రయించిన వారు వారందఱు విష్ణువు పరమపదమునకుఁ బోదురు. అని చెప్పఁబడెను.

**సుగ్రీ :-** ప్రపన్నులకు మాత్రమే నీ వభయహస్త మిచ్చెదవా? భక్తాదులకు నిచ్చెదవా?

**రామ :-** రామచంద్రమూర్తి నన్ను రక్షించు నను విశ్వాసము గలవారి నందఱను రక్షించెదను. ఎట్లనిన :- దండకారణ్య మునులు మేమెల్లరమును నీవిషయమునందు నుండుట నీచే నెపుడుం గావంబడ నర్హుల మనిరి. (అరణ్య 14) లో వారిని రక్షించితిని. (ఈ కాలమున విష్ణ్వాలయ మేగ్రామమందున్నదో యాగ్రామ మందుండి భగవంతుఁడు రక్షకుఁడను నిశ్చయజ్ఞానము గలిగినను జాలును). అనుకూలుఁడై వచ్చిన విభీషణు రక్షించితిని. కేవల ప్రతికూలుఁడైన రావణుఁడు వచ్చినను రక్షించెద నంటివి. (యుద్ధ 388) నాదు గురువులఁ గనుటకుఁ జన నానతిమ్మని యుదాసీనయైన శబరిని రక్షించితిని. “పరమగతి కారణంబయ్యెఁ బ్రథనమున” నని చెప్పఁబడిన మృగమగు వాలిని (కిష్కింధ 422) అనుత్తమగతి కరుగుము, మదాజ్ఞ నని పక్షియగు జటాయువును (అరణ్య 1176) ఘోరపాపముచేసి శాపదష్టమై పడియుండిన యహల్యను (బాల 996) పలుగాకి కాకియగు కాకాసురుని, వీరినెల్లఁ గాచితినిగదా. ఇదియేమి? అయోధ్యలో నుండు కంటికిఁ గాన రాని భూతములు నన్నుఁ జూచిన ప్రాణములు చెట్లుచేమలు స్థావరములు నన్నియు నే నీలోకమును విడిచి పోవునపుడు నావెంటరాఁగలవు. నీవే చూడఁగలవు. (ఉత్తర 1649) ఈ లోకమం దుండువారే గారు దేవలోకముల నుండు బ్రహ్మేంద్రాదులు దిక్పాలురు నారూప మర్చించుచు నానామము జపించుచు నా మూర్తిని దమలోకముల నుంచుకొని పూజించుచున్నారు. వారినందఱ రక్షించెదను. “ద్విపరార్ధావసానే

మాం(పాప్తు మర్హసి పద్మజ" యని బ్రహ్మకును నే నభయహస్త మిచ్చియున్నాను. వీరు వారననేల నాయెడ నాభిముఖ్యము గలవారి నందఱ రక్షించెదను. పరాఙ్ముఖులు వారి గతికొలఁది వారధోలోకములకుఁ బోదురు.
**సు :–** ఆభిముఖ్యము గలిగినంతమాత్రమున నీవందఱు రక్షించెదవేని వానికిఁ బ్రపన్నులకు నేమిభేదము?
**రామ :–** భక్తాదులందఱకు నీజన్మమందే ముక్తి నిచ్చెద నని నేను జెప్పలేదు. వారికిఁ గాలాంతర జన్మాంతరములందు ముక్తి నిచ్చెదను. వాసుదేవస్సర్వమ్మను భావముగల పరమభక్తునకుఁ బ్రపన్ననకు మాత్ర మీ జన్మాంమందే తప్పక ముక్తి నిచ్చెదనని నేను బ్రమాణముచేసి యున్నాను. మార్గమందు భేదములుగాని యిరువురభావ మొకటియే. పరమభక్తుఁడు పెక్కు జన్మముల భక్తిని సాధించినాఁడు. ప్రపన్నుఁడు తన భారుమును నా మీఁదవైచి తల్లిదండ్రులయొద్దఁ జంటిబిడ్డవలె నుండువాఁడు. పరమభక్తుఁడు తల్లిదండ్రులు దైవతములను జ్ఞానము గలవాఁడై పితృసేవ భక్తితోఁ జేయు నట్టివాఁడు. తల్లిదండ్రు లిరువురు నాదరింతురుగదా.
**సు :–** అట్లైన భక్తికిఁ బ్రపత్తికి నేమిభేదము.
**రామ :–** ఫలము సమానమే, మార్గములు వేఱువేఱు. మీ యూరికిఁ బోవలయుననిన నెన్నిత్రోవలున్నవి? అట్టులే, రెంటికి భేదము చెప్పెద వినుము.

**1.** భక్తి, స్వధర్మజ్ఞాన వైరాగ్య సాధ్య భక్త్యైక గోచరుఁడు నారాయణుఁడని చెప్పఁబడుటచే స్వధర్మ నిష్ఠచేఁ గలిగిన జ్ఞానమువలన లభించిన వైరాగ్యముచే జనించిన భక్తి యినుటచే భక్తి యుపాయమనియు నది చేతనుని వ్యాపారముపై నాధారపడి యున్నదనియు నేర్పడెను. కావున నది సాధ్యోపాయము. ప్రపత్తి యుపాయమనుట యుపచారము మాత్రము. ఉపాయము, ఉపేయము, రెండును భగవంతుఁడే. భగవంతుఁడు సిద్ధోపాయము. సిద్ధరూపం పరంబ్రహ్మ యనికదా శ్రుతి చెప్పుచున్నది. కావునఁ బ్రపత్తి సిద్ధోపాయము.

**2**. ధ్రువాస్మృతి యన్నట్లు భక్తి తైలధారవలె నవిచ్ఛిన్నమైన స్మృతి సంతానరూపము. కావున నచేతనము. ప్రపత్తి 'యస్సర్వజ్ఞ స్సర్వవిత్' సత్యం జ్ఞానమ్ అను శ్రుతిసూక్తులవలన సర్వజ్ఞము జ్ఞానస్వరూపమునై యున్నది.

**3.** భక్తి 'ఆవృత్తి రసకృదుపదేశా' త్తనునట్లు అనేక జన్మపుణ్య ఫలమగుచుఁ జిరకాలసాధ్యము.

ప్రపత్తి "తద్ద్వయం సకృదుచ్చారో భవతు' అన్నట్టు లొకసారి యనుష్ఠించినఁ జాలును.

**4.** తస్యదావదేవ చిరమ్మన్నట్లు (ఛాందో) ప్రారబ్ధ దేహావసాన పర్యంతము కాలవిలంబనము గలది. ఈ లోపల దాని ఫలము చూపఁజాలదు.

ప్రపత్తి ఉపాయోయం చతుర్థస్తే యన్నట్లు ప్రపన్నుఁడు కోరినచో వెంటనే ఫలము చూపఁగలదు.

ఇది యార్తప్రపన్నుని విషయము. తానైదేహము నిలుపఁగోరిన దృప్తునకు నాదేహావసానమున ఫలమిచ్చును. ఆర్తిభేదముచేఁ గాలభేదము.

**5.** భక్తినిష్ఠునకుఁ బ్రారబ్ధకర్మశేషమువలన దేహాంతర పరిగ్రహము కలిగెనేని ఫలప్రాప్తికిఁ గాలవిలంబ మధిక మగును.

ఈ విషయము బ్ర. సూ. 4-1-18. "భోగే నత్విత రేక్ష పయిత్వాథ సంపత్స్యతే" యను సూత్రమున భాష్యమునఁ జర్చింపఁబడినది. "బ్రహ్మవేత్తయొక్క పుణ్యాపాపములనేక శరీర భోగ్యఫలములైనచో ననేక జన్మములనెత్తి యాకర్మ ఫలముల నన్నింటి ననుభవించి యనంతరము బ్రహ్మమును బొందుచున్నాఁడు."

ప్రపన్ననకు దేహాంతరప్రాప్తి లేదు. ప్రపత్తిచేసిన దేహముండువఱకే కాలవిలంబము.

**6.** భక్తిరూపాపన్న జ్ఞానము పుట్టుటకు విరోధులుగా నుండు పాపములు నశించుటకు యజ్ఞదాన తపస్సు లవశ్యములై యుండును.

ప్రపత్తియందు అంగము, అంగి, ఉపాయము ఉపేయము నేనే యగుటచే నితరసాధన సాహాయ్యముతోఁ బనిలేదు.

**7.** భక్తి విరోధులగు పాపముల జయించుటకై చేయు యజ్ఞదాన తపస్సులు కష్టసాధ్యములు.

ప్రపత్తి యనుష్ఠానదశనుండి సుఖరూపమే.

**8.** ఆ యజ్ఞాది సాధనములు అపాయకరములు. మిథ్యాప్రయుక్తో యజమానంహి నస్తి. యజ్ఞాదు లనుష్ఠించునపుడు అలక్ష్యముతోఁ గాని వ్యర్థమైన వేడుకతోఁ గాని శాస్త్రోక్త క్రమము వదలిగాని యనుష్ఠించిన యెడల నవియే యజమానుని జంపునని యర్థము. జ్ఞానదోష పరిభ్రష్ట శ్చాండాలీం యోని మాస్థితః' దేశ

కాల పాత్రముల నెఱుఁగకయు జ్ఞానములేకయు ననుష్ఠించిన పక్షమందుఁ జండాలత్వమును బొందును అని యర్థము. కర్మజ్ఞాన భక్తులం దీయపాయముగలదు.

ప్రపత్తి చేయుటయందుఁ గర్మము రెండుచేతులు జోడించుట, నీవాఁడను, కాపాడుమనుట. కావున నిరపాయము.

**9.** యజ్ఞాదులకుఁ గావలసిన పదార్థములు నశించు స్వభావముగలవి, ప్రయాసపడి సాధింపఁదగి నవి, పరసాహాయ్య మపేక్షించునవి.

ప్రపత్తికిఁ గావలసినది యంజలి, కావున నశించునది కాదు. ఇతరుల సాహాయ్య మపేక్షింపదు. సుకరము. అని పుణ్యఫలముల నిచ్చినపిమ్మటఁ దత్పూర్వము మంత్రలోప క్రియాలోప భక్తిలోపములచే నశించునవి. అంజలిఫలము కలకాల ముండునది.

సకాములకు స్వర్గఫలము. నిష్కా ములకు మోక్షము నిచ్చును. అటైన నానుకూల్యసంకల్పము, ప్రాతికూల్య వర్జనముకూడ నవాశ్యకములేకదా యనిన నవి సర్వముక్తి ప్రసంగము రాకుండుటకై విధింపఁ బడినవి. ఉపాయ స్వీకారమందిదియే యుద్దేశము. సర్వముక్తి ప్రసంగము రాకుండుట యనఁగా శాస్త్రవిహిత మర్యాదలు స్వధర్మము సదాచారములు తప్పి వర్తించువారికిని దురాచారులకు సైతము మోక్షము రాకుండుటకై శమదమాదులగు నాత్మ గుణములుగల యానుకూల్య సంకల్పము విధింపఁబడెను.

దీనివలన నాయందుఁ బక్షపాతము దయాహీనత యను దోషములు దొలఁగినవి.

**10.** భక్తికి నంతిమ స్మరణము (మరణకాలమున నన్ను స్మరించుట) నియతము.

ప్రపత్తికి నంతిమస్మరణ మనావశ్యకము. అంత్యకాలమునఁ బ్రపన్నుఁ డేదశయందున్నను నేనే స్మరించి వానికి ముక్తిని చ్చెదను.

**11.** ఉపాయాంతరములు స్వయత్నసాధ్యములు గావున నిరపాయముగ ననుష్ఠించుటయందు సమస్తభారము చేతను నందుఁ గలదు.

ప్రపత్తియందు సకలభారము నాయందుఁ గలదు. కావునఁ బ్రపన్నులకు భారముతోఁపదు. వారు ప్రమాదమునఁ గార్యములు తాఱుమాఱుగఁ జేసినను నేను దానిని లెక్క కుఁదీసికొనను. వారికిఁ బ్రమాదబుద్ధి యిచ్చినవాఁడను నేనేకదా. నాప్రపన్నుఁడు తెలిసి యకార్యముచేయఁడు. ప్రపన్నుఁడు తనస్వరూపమగు పారతంత్ర్యమునకు హాని రాకుండఁ గనిపెట్టవలసిన భారమొక్క టియే యతనియందుఁ గలదు తక్కి న విషయములం దతని కేభారములేదు.

**సు :–** అటైన నీవు మోక్షముమాత్ర మిచ్చెదవా? ధర్మార్థకామము లిచ్చెదవా?

**రామ :–** ఎవరేదికోరిన నది యిచ్చెదను, ఎక్కు వది కోరినఁ దక్కు వదికూడ నిచ్చెదను. అనఁగా ధర్మము కోరెనా అర్థము, కామముకూడ నిచ్చెదను. మోక్షము కోరెనా ధర్మార్థ కామములనుగూడ నిచ్చెదను. అర్థము కోరిన నర్థము కామము నిచ్చెదను. కామము కోరిన నంతకెక్కు వ యేదియురాదు. కామము మాత్రము గోరువాఁడు పశువుతో సమానుఁడు. వాని సుఖముమాత్రము వాఁడు చూచుకొనును. అర్థము గోరినవాఁడు తానుసుఖ పడవచ్చును. తన యాశ్రితులను లోకులను సుఖపెట్ట వచ్చును. ధర్మమందుండువాఁడు లోకము నంతయు సంతోషింపఁజేయును. కావున నేయుద్దేశముతోఁ బ్రపత్తిచేసినను జేయవచ్చును. నిన్నుఁ గిష్కి ంధా ప్రభువుచేసినప్పుడు దానికి లోపడిన పల్లెలు, గ్రామములు, అడవులు, కొండలన్నియు నీ వనుభవింపఁ దగినవేకదా. వానియందుండు వారికి నీపైనధికారములేదు గాని నీకందఱపై నధికారము గలదుకదా.

**సు :–** సకల భూతములవలన నంటివే, పుట్టినవానివలననా? పుట్టఁబోవు వానివలననా?

**రామ :–** మోక్షముగోరువాఁ డన్ని భూతములను దాఁటిపోవు వాఁడు కావున వాని కేభూతముల వలనను నేకాలము నందును నేదేశమునందును భయములేదు. తక్కి నవారో వారివారి కోరికలవలనఁ గలుగు ఫల మనుభవింపవలసి యుండును. నీవే వానరరాజ్యము గోరితివి. ఇచ్చితిని, దానివలనఁ గలుగు సుఖదుఃఖ ములు నీ వనుభవించుచున్నావు. అనుభవింపఁగలవుగదా. అట్టులే యన్నియును.

**సు :–** అభయము ఘటియింతునంటివి, విభీషణుఁడు రావణునకు భయపడివచ్చెను. రావణుభయము లేకుండఁ జేయుదు వంతియే కదా.

**రామ :–** విభీషణుఁడు కోరిన దామాత్రమేయైన నంతియే చేయుదును. రాజ్యముగోరిన రాజ్యమిచ్చెదను. ఏమి గోరఁ డాయెనా? రాజ్యమేకాదు మోక్షముకూడ నిచ్చెదను. ప్రపన్నులు తమకోరిక లనుత్రాళ్ళచే నన్నుఁ గట్టి నిర్భంధించి నీవింతే యియ్యవలయును నన్నపుడు వారి నిర్బంధములకు లోపడి యంతియే యిత్తును.

అట్టి నిర్బంధము లేనప్పుడు నేనెంత యియ్యఁగలనో యంతయు నిచ్చెదను. నాతో సమానునిగనే చేసెదను. భయ కారణములు పెక్కు గలవు. పతివ్రతలకు వైధవ్యభయము, రాజులకు శత్రుభయము, ధనికులకు దారిద్ర్యభయము, ఆరోగ్యవంతులకు రోగభయము, ముముక్షువులకు సంసార భయము, సర్వభూతములకు మరణభయము, ఎవరేభయమునుండి రక్షింపఁ గోరుదురో వారి నాభయమునుండి రక్షింతును. వీనిలో వావిరువురి యభయము = ఉత్కృష్టమైన యభయము నాసాయుజ్యమే.

**సు :–** నీవు వీనికిచ్చు నభయము త్యాగమా? ఔదార్యమా? ఉపకారమా? దానమా?

**రామ :–** కీర్తిరావలయునని కోరి యిచ్చునది త్యాగ మనఁబడును. నాకట్టికోరికలేదు. ఔదార్యమనఁగాఁ జనుఁబాలుచేఁపునట్లు విషయవైషమ్యమును జూడక తనపేరుగా నిచ్చుట. అట్టి ప్రతిష్ఠయందు నాకుఁ గాంక్షలేదు. ఉపకారమనఁగా బదులు మేలుకోరి యొకరికిచ్చుట. ఇతని వలన నేనేమేలు గోరలేదు. దానమనఁగా దీనివలన నాకీఫలము కాలాంతరమందో జన్మాంతరమందో కలుగఁగోరి మంత్రవంతముగ నిచ్చుట. వీనిలో నేను జేయునది యేదియుఁగాదు. ఘటియింతు ననఁగాఁ గలిగింతు ననియే యర్థము. ఇది త్యాగము గాదు. ఔదార్యాదులు గావు. చలిచేత వణఁకువాఁడు వేఁడిమి చలికి విరోధియని తెలిసికొని యెండలోనికిఁ బోవును. వానికిఁ జలి తొలఁగెను. ఆరోగ్యము కలిగెను. ఇందు సూర్యుఁడు చేసినది త్యాగమా ఔదార్యమా ఉపకారమా దానమా ఏది? నేను జేయునది యంతేయనుకొమ్ము. వాఁడు చేసిన శరణాగతియే వానిని రక్షించును. నేను నిమిత్తమాత్రమే.

నిమిత్తమాత్ర మేవాసౌ । సృజ్యానాం సర్గకర్మణి । ప్రధానకారణీ భూతా । యతోవై సృజ్యశక్తయః । నిమిత్తమాత్రం ముక్త్యైవ నాన్యత్కించి దపేక్షతే । నీయతే తపతాం శ్రేష్ఠస్వ శక్త్యావస్తువస్తుతాం । కర్మభిర్భావితాః పూర్వైః కుశలాః కుశలైః ప్రజాః ॥ సృజింపఁబడునట్టి వస్తువులు తమసృష్టి విషయమున నిమిత్తమాత్రము నపేక్షించునవి. వానియందుఁ గల శక్తులే వానిసృష్టికి ముఖ్యకారణములు. అవి నిమిత్త మాత్రమునుదప్ప వేఱొక్క దాని నపేక్షింపవు. స్వశక్తిచేతనే వస్తువు లాయా శరీరంబులఁ బొందుచున్నవి. అట్టి శక్తులు వారు వారొనర్చునట్టి పుణ్యపాపములే. చింత గింజయందుఁ జింతచెట్టగుశక్తి యున్నది. కాని తనంతటఁదానే చెట్టుకాఁ జాలదు. మనుష్యుఁడొకఁడు దానిని భూమిలోనుంచి నీళ్ళు పోయవలయును. చింతవిత్తనము నుండి మామిడిచెట్టు వచ్చునట్లు వాఁడు చేయలేఁడు. అట్టులే శరణాగతియందు ఆజన్మమందే ఫలమిచ్చు శక్తిగలదు. ఆఫలము వానికిఁ గలుగునట్లు చేయుటే నాకార్యము.

**సు :–** అట్లైన మైత్రినటించినను నేను జేతిని విడువనంటివే నీవు వాని మోక్షఫలమేకదా వాని కీయవలెను.

**రా :–** మనో వా క్కా యములను మూఁటిలో రెంట వాఁడు చేసినదానికి ఫల మీయవలయును గదా. అది నేనెట్లు తప్పింపఁగలను. ఆ రెండే వాని మనస్సును దమ్రోవకుఁ గ్రమముగఁ దీసికొనివచ్చును. ఆవిషయమున నేను దోడుపడుదునుగాని వాఁడు మోసము చేసినాఁడని కోపింపను. వానిని వాఁడు మోసము చేసికొనెను గాని నాకు వాఁడు చేసిన కీడేమి గలదు?

**సు :–** నీ సాయుజ్యమనఁగా నేమి?

**రా :–** నీవు నాయొద్దకుఁ జేరకముందెట్టి సంబంధ ముండినది మనకు నిప్పుడెట్టి సంబంధమున్నది. లక్ష్మణు నంతటివాఁడవు నీవైతివిగదా. మానలువురిలో నీవైదవ సోదరుఁడవు నిర్మలచరితా యని భరతుఁడు ననఁగలఁడు. నీవు విభీషణుఁ జంపవలె నఱకవలె నిప్పులలోవేసి కాల్పవలె నంటివే నే నభయ మిచ్చిన పిమ్మట నీవే **'మాసమానుఁడయి క్రాలుతమమ్ములఁ గూడి యప్డ మేధావి విభీషణుండు సఖితంగని'** యంటివా లేదా? ఇప్పుడు మనమందఱము సోదరులమే కదా. మీరు నన్నుఁ బెద్దగా గౌరవించి పెత్తనము నాయం దుంచితిరే కాని తక్కి న విషయంబుల మీకు నాకు భేదముగలదా. సీతతప్ప నా సర్వస్వము మీదికాదా. నా ప్రాణములుకూడ మీ చేతియం దున్నవికదా. ఇట్టి సామ్యమునకే సాయుజ్యమనిపేరు. హనుమంతుని కిచ్చినట్లు నన్నే మీ స్వాధీనపఱిచితిని. అంతకెక్కు వ నేనేమి యియ్యఁగలను. దీనినే వావిరి యభయమంటిని. తక్కి న వన్నియు దీనికి లోకువే.

**సు :–** ఇదియ వ్రతమగు నంటివే. ఏల?

**రామ :–** తక్కి న యన్ని కార్యములు నేను నా సంకల్పనుసారము చేయుచుందునుగాని యొక నిర్బంధము వలన విధిగాఁ జేయువాఁడనుగాను. శరణన్న వానిని రక్షించుట యనునది నాకు వ్రతము. నాకిష్టముండినను లేకుండినను నేను జేయక తప్పదు. ఆవిషయమందు నాకు స్వాతంత్ర్యము లేదు. అన్ని విషయముల నేను సర్వశక్తుఁడనే కాని యీ విషయమందు నే నశక్తుఁడనే. ఎట్టి సంకటముల నైనఁ దప్పించుకొను నుపాయము

నే నెఱుఁగుదును గావున నేను సర్వజ్ఞుఁడనే కాని శరణు అన్నమాట చెవిని బడఁగానే అభయమనక తప్పించుకొనుటెట్లో నే నెఱుఁగను కావున నీవిషయమున నే నజ్ఞుఁడనే. వ్రతముగా ననుష్ఠించునది యిది యొక్క టియే కావున నిదియ యంటిని.
**సు :-** వ్రతమనఁగా నేమి?
**రా :-** యావజ్జీవము జరపెదనని పట్టిన నియమము, కలకాలము పెట్టుకొన్నను బెట్టుకొనవచ్చును. హనుమంతునకు బ్రహ్మచర్యవ్రతము, దానియందు స్ఖలనము వచ్చెనా యతఁడు భ్రష్టుఁడు, అవకీర్ణి యనఁబడును. అట్టులే నాకు శరణాగత రక్షణమునుండి స్ఖలనమువచ్చెనా నేను భ్రష్టుఁడనే. అవకీర్ణినే.
**సు :-** ఇది నా వ్రతమనినఁజాలునే, వ్రతమగు నంటివే యేల?
**రా :-** నిత్య విధియనియుఁ దప్పించుకొన సాధ్యపడదనియుఁ దెలుపుటకే.
**సు :-** నాకుꣳ అంటివే. ఈ ప్రతముగలవా రితరులు లేరా?
**రా :-** తక్కి న బ్రహ్మరుద్రాదులు ఇష్టము వచ్చినవారిని రక్షింతురు రానివారిని విడుదురు. మొదటఁ జేరఁదీసినను దరువాతఁ జేయివిడుదురు. ఇతరులు సందర్భానుసారముగ వర్తింతురు. తొలుత వరమలిచ్చిన బ్రహ్మ రావణునిఁ దరువాత శపించెఁగదా. దొలుత రావణునకు వరములిచ్చిన రుద్రుఁ డిప్పుడు రక్షింపరాఁ డాయెఁగదా రక్షణ కార్యభారము వారియందు లేదు. అదివారికిఁ బదిలోఁ బదునొకండవది, నాకట్లుగాదు. సృష్టించుబ్రహ్మయు సంహరించు రుద్రుఁడు రక్షణమం దుత్తరవాదులు గారు. నాకట్లుగాదు నిత్యవిధి. కావున నాకది వ్రతము. 'నహిపాలనసామర్థ్యం ఋతే సర్వేశ్వరాద్ధరే' యనియు, 'రక్షార్థం సర్వలోకానాం విష్ణుత్వ ముపజగ్నివాꣳ' అనియుఁ బ్రమాణములు.

మోక్షమిచ్చు నధికారము నాయందు మాత్రమే కలదు. తక్కి న యెవ్వరియందులేదు, తక్కి నవారు మోక్షము తప్పఁ దమయధికారానుసారము నేదైన నీయఁగలరు.
**సు :-** నాకుꣳ, 'నాకు' అనినఁజాలునుగదా, నాకును అంటివే. ఏల?
**రా :-** ఈ వ్రతము నాకెట్టులో నాభార్య సీతాదేవికి నట్టులే, తన్ను విశేషముగ బాధించు రాక్షసస్త్రీలకు వారొక్క నమస్కా రము చేసినంతమాత్రముననే యభయ మిచ్చెనని హనుమంతుఁడు చెప్పలేదా? రాక్షసస్త్రీలు సీతను బాధించినట్లు విభీషణుఁడు మనల బాధించెనా? ఆమె చేసినంతమాత్రమైనను నేను జేయవలదా? ఆమె సహధర్మచారిణి కావున మేమిరువురము ఒక్క ధర్మమం దుండు వారమే.

**(సశేషము.)**

**శ్రీ ఒంటిమిట్ట కోదండరామసేవక సమాజము.**
**తూర్పుగోదావరి మండల ప్రథమవార్షికసభ - మండపేఁట.**

శ్రీ మదొంటిమిట్ట కోదండరామసేవక సమాజము యొక్క తూర్పుగోదావరీ మండల ప్రథమవార్షిక సభ మండపేఁట గ్రామములో భావసంవత్సర అధికవైశాఖ బ. 5-6-7 గురు-శుక్రు-శని వారముల (మే నెల 3-4-5 తేదులందు) శ్రీ సీతారామ భూపాలుని యధ్యక్షత క్రింద జరగినది. అధ్యక్ష ప్రతినిధి బ్ర. శ్రీ. శ్రీవాసుదాసస్వామివా రీసభను నిర్విఘ్నముగా నెఱవేఱునట్టు లాశీర్వదించిరి. ప్రథమదినమగు 3వ తేది యుదయమున నీసభ దైవ ప్రార్థనముతో నారంభింపఁబడినది. ఆహ్వాన సంఘాధ్యక్షులు స్వాగతోపన్యాస మయిన పిమ్మట నధ్యక్ష ప్రతినిధియగు శ్రీశ్రీ వాసుదాస స్వామివారు సమాజస్థాపనకుఁ గారణము సమాజ మునఁజేరి భగవదనుగ్రహమునకుఁ బాత్రులయి శుష్క వేదాంతి మాయాయోగి బృందముల బాటి పడక తప్పించుకొనినవారి విషయములు మున్నగునవి సంగ్రహముగా నుపన్యసించిరి. ఆనాఁటి సాయంకాలము సమాజోద్దేశ్యములను గుఱించి సుబ్బదాసుఁడు ప్రసంగించెను. రెండవనాఁడంతయు శ్రీ వాసుదాస స్వామి వారు భక్తి యావశ్యకత భక్తిలక్షణము లనుష్ఠాన విధానమును గుఱించి యుపన్యసించిరి. మూఁడవ దినమున స్త్రీలసభ జరిగినది. స్త్రీలకుఁ బాతివ్రత్యము, గృహకార్యనిర్వహణము ముఖ్యములనియు, సనాతనధర్మమార్గము ననుసరించి నడచుచు వానిని నిర్వంచనముగాఁ జేయువా రుభయలోక సుఖముల ననాయాసముగఁ బొందఁగలుగుదురనియు, నడవులయందు మహర్షులు ఘోరమగు తపస్సు లాచరించి యేపదవి, యేమహిమ ము బడయఁగలిగిరో యట్టి ఫలసిద్ధి సులువుగ సతీమతల్లు లిండ్లయందుండి పతిదేవతలయి భర్తృశుశ్రూష సేసి పడయఁ గలుగుదురనియు, తలిదండ్రులసేవ వదలి యడవియందుఁ దపోనిష్ఠ నుండిన కౌశికుఁడను బ్రాహ్మణ బాలకునకు పతిసేవాపరాయణయైన నొకయిల్లాలికిని జరగిన సంవాదమును భారతమునఁ జదివినవారి కీయర్థము తేటతెల్లమగుననియు, భర్తయానతిలేనిదే యేకార్యమునుగాని స్త్రీలు స్వతంత్రించి

చేయరాదనియు వారి యంగీకారముఁ గొని దేవతాదర్శనమునకు, యోగ్యులగు పెద్దల దర్శనమునకు మాత్రము బోవచ్చుననియు, దేవాలయములకుఁ బోయినప్పుడు తనభర్తయే భగవంతుని రూపమున నున్నాఁడనియు, నింటియందు భర్తను సేవించునపు డాదేవుఁడే భర్తృరూపమున నున్నాఁడని భావింపవలెననియు, నట్లుతలంపక పరస్పరము భిన్నములని తలంచిరేని వారు వ్యభిచారిణులే యనియు, భార్యాభర్తృసంబంధ మొక నాఁటితోఁ బోవునది కాదనియు, వారు మోక్షమునకుఁ బోవు వఱకు విడువక వారినంటి యుండు ననియు, భర్తృవియోగ మయినమాత్రమున నాసంబంధలత సమూలముగఁ దెగిపోయినదని తలంపరాదని యు, వైధవ్యమునకుఁ గారణము దుష్కామ ప్రవృత్తియేయనియును, ఆనేరమునే మరలఁజేసిన శిక్షమఱింత యెక్కు వగుట నిస్సంశయమనియుఁ గావున బ్రహ్మచర్యదీక్షనుబూని హరినిసేవించి కృతార్థులయి తమకు తమభర్తలకు గతులు గల్పింతురుగాత యనియు, భర్తలుగల సతీమతల్లులు తమభర్తల నే దైవముగాఁ దలంచి వారి శుశ్రూష గావించుచు సనాతనధర్మమును విడువక దైవభక్తిగలిగి తాము గృహలక్ష్ములయి యిహ పరలోకముల ననంత సౌఖ్యములఁ జుబ్బన చూఱగా ననుభవింతురుగాత మనియు నుద్బోధించిరి.

నీ సభలు ఏయంతరాయములేక చక్క గ నెఱవేఱునట్లు లమృతపుఁజూపులఁ బ్రసరింపఁజేసిన శ్రీ సీతారాముల కీ సమాజసభ్యు లెల్లప్పుడు మనోవాక్కా యముల నిష్క లం భక్తిగలిగి సేవించుచున్నారు.

శ్రీ వాసుదాసస్వామివారు రచించుచుండిన శ్రీ ఆంధ్రవాల్మీకి రామాయణ వ్యాఖ్యానమగు మందర మింత శీఘ్రకాలమునఁ బూర్తి అవుటకు కోలంకవీరవరము యస్టేటు జమీందారులగు మహారాజ రాజశ్రీ శ్రీరాజారావు రామాయమ్మా రావు బహద్దరుగారి యనిర్వాచ్యమగు పరిపూర్ణాదరణమే కారణము మఱొక చోట నెందైన నాలుగైదేఁడులకుఁ బూర్తికాఁదగిన గ్రంథము తొమ్మిది నెలలోఁ బర్యాప్త మయినదనిన శ్రీరాజా అమ్మగారి యాదరణ మెట్టిదో వేఱుగఁ జెప్పఁ గనక్క ఱయుండదు. ఇట్టి యుద్గ్రంథ మిదివఱ కాంధ్రభాషయందు లేదనుట వాస్తవము.

ఇట్టి యుద్గ్రంథ రచనమున కెల్లవిధముల శ్రీరాజాఅమ్మగారే తగిన యేర్పాటులు గావించి యింత తొందరలో గ్రంథము పూర్తిగావింప శ్రీవాసుదాస స్వామివారి నాదరించి యాంధ్రుల కింతంతనరాని మేలు సమకూర్చిరి. జగదుపకారశీలయు, నుదారచరితయు నగు శ్రీ రాజా అమ్మగారి కాంధ్రలోకము చేయెత్తి నమస్క రింపవలసి యున్నదని సభ్యులందఱు నేక గ్రీవముగ నామోదించిరి.

ఇఁక గోదండరామసేవక సమాజసభ్యులను గుఱించి చెప్పనేల? తూర్పుగోదావరి మండలమందలి కోదండరామసేవక సమాజసభ్యులెల్లరు శ్రీరాజాఅమ్మగారికి గృతజ్ఞతా సూచకవందనము లర్పించుచు శ్రీరాజా అమ్మగారి కితోధిక శ్రేయః పరంపరలఁ బ్రసాదింప శ్రీసీతారాముల నిరంతరము భజించుచున్నారు.

ఈ మండలమున శ్రీ కోదండరామ సేవక సమాజ సభ్యులు చాలకొలఁదిగ నున్నారు. ఈగ్రామమున 20 మందికి లోపుగఁగలరు. ఇంతటి స్వల్పసంఖ్యాకులయ్యు భక్తిశ్రద్ధల పెంపున నిట్టి సమావేశమునకుఁ గడంగుట శుభోదర్క ము. వీరియందును నీసమాజమునందును నభిమానముగలిగి యీ గ్రామమువారు తోడుపడి వీరికృషిని సఫలము గావించినందుల కీ సభవా రనేక వందనము లాచరించు చున్నారు. కడప, నెల్లూరు, గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి మండలముల నుండియు సభ్యసోదరు లేతెంచి యీసభ నర్విఘ్నముగా జరగ నాశీర్వదించినారు. వారికి నీసభవా రభివాదము లొనరించుచున్నారు. భగవన్నామ సంకీర్తనముతో సభ ముగిసినది.

తరువాత శ్రీవాసుదాస స్వామివారు లేచి నేఁడు భరతదేశమున నా సేతు శీతశైలము, సనాతనధర్మ కల్పతరువు నుఱ్ఱూఁతలూగించుచున్న, దేవాలయములందుఁ జండాలురఁ బ్రవేశపెట్టు శాసనము, అస్పృశ్యతా నివారణము, వివాహవిచ్ఛేద శాసనము మున్నగు ధర్మవిధ్వంసక శాసనములఁ గావింపకుండఁ బ్రభుత్వమువారినిఁ బ్రార్థించుచు వారికి మనవులంపుట సనాతనధర్మ మతావలంబులగు నీ సమాజము వారికిఁ దదభిమానుల కవశ్యకరణీయము. కావున నీసమాజముపక్షమున దొరతనమువారికి పంపుటకు నేర్పాటుకాఁ బడిన కాగిదములపై సంతకములు చేయఁ గోరిరి.

5వ తేది సాయంకాలము 6వ తేదీన తూర్పు గోదావరి మండల సనాతన ధర్మసభలు శ్రీవాసుదాస స్వామివారి యాజమాన్యమున జరుపఁబడి అస్పృశ్యతా నివారణము పంచములను దేవాలయలందుఁ బ్రవేశపెట్టుట, వివాహవిచ్ఛేదము మున్నగు నశాస్త్రీయములు, సనాతనధర్మ విధ్వంసకములునగు శాసనములకుఁ జేయూఁత యియ్యవలదని దొరతనము వారినిఁ గోరుచు నేక గ్రీవముగఁ దీర్మానించిరి.

**పాంచజన్యము.**

ఇది సనాతన ధర్మప్రబోధకమగు తెలుఁగు వారపత్రిక సనాతన ధర్మమునుగుఱించి ఆంధ్రులకుఁ దెలుపుపత్రిక యిది యొకటియే. సనాతనధర్మ మతావలంబులగు నాంధ్రులందఱు నీ పత్రికను బోషించి స్వధర్మమును గాపాడఁ బ్రార్థితులు. దీనికిఁ జందా సంవత్సరమునకు ర్పు, 3-0-0 లు. సనాతన ధర్మ విషయమున నాంధ్రమునఁ బత్రికలేదని సంజీవని విచారపడి యుండెను. ఆకొఱంత యాపత్రికదీర్చి సంజీవనీ భారము తగ్గించినది. మేనేజరు, పాంచజన్యము బెజవాడ, అని వ్రాతాయవలయును.

**శ్రీ వాసుదాసస్వామివారి పర్యటనము.**

శ్రీ వాసుదాస స్వామివారు ఏప్రిలు 30వ తేది సాయంకాలము 5 గంటలకు శ్రీ రాజా అమ్మగారి సెలవు తీసికొని లక్ష్మీనరసాపురమునుండి మండపేట గ్రామమునకు విచ్చేసిరి. 3-4-5 తేదుల తూర్పు గోదావరీ మండల శ్రీ కోదండరామ సేవక సమాజ ప్రథమవార్షిక సభలును సనాతనధర్మ సభలును జరిగినవి. అచటనుండి 10వ తేది బయలుదేఱి కోరుకొండ గ్రామమునకు విజయముచేసిరి. ఈగ్రామమున భక్తిని గుఱించియు సనాతనధర్మమును గుఱించియు నుపన్యసించిరి. ఇచ్చట 20 గురు చక్రాంకితులైరి. ఇచట నుండి 20వ తేది బయలుదేఱి చాగల్లునకు సమీపమునందుఁ గల మల్లవరమునకు మ-రా-శ్రీ లకంసాని గంగరాజుగారి యాహ్వానమున నచటికేతెంచి యచట శ్రీరామకృష్ణ భజనమందిర తృతీయవార్షికోత్సవమును దిలకించి 23వ తేది యేలూరునకు విజయముచేసిరి. ఆంధ్రరాష్ట్రీయ సనాతనధర్మసభలు చూచుకొని 28-29 తేదులు తెనాలిలోనుండి, 30వ తేదికి ఒంటిమిట్టజేరిరి. ఇచట జ్యేష్ఠ శు 12 ల ప్రభృతి శ్రీవరదాభయ కోదండ రామ స్వామివారి యుత్సవములు జరపఁబడును. ఈ యుత్సవమునందుఁ గల్యాణోత్సవము శ్రీ రాజారావు రామాయమ్మ గారి యభ్యుదయ నిశ్రేయసాభివృద్ధికై యామెగారి పేర శాశ్వతముగ జరుపఁబడును. ఈ సమయమందే మందరము సమగ్రగ్రంథము శ్రీ కోదండరాముల వారి కర్పింపఁబడును. అవికాఁగానే అచ్చటనుండి యెద్దనపూఁడి సభకుఁ బోవఁదలఁచి యున్నారు.

**మందరనిధి.**

మందర ముద్రణమునకు విరాళములు.

| | |
|---|---|
| గ్రంధి కోట్లింగంగారిభార్య, కామరాజుగారు, కోరుకొండ. | 25-0-0. |
| కోరుకొండ పౌరులు. | 170-0-0. |
| జంబూపట్నము పౌరులు. | 35-0-0. |
| శ్రీమతి. శ్రీదేవమ్మగారు, తిరుపూరు. | 10-0-0. |

నొసంగిరి వీరికి శ్రీసీతారాము లభ్యుదయపరంపరలఁ బ్రసాదింతురుగాత.

మందల మేడవభాగమునకై రు. 1000-0-0 లు మ-రా-శ్రీ, శ్రీ రాజారావు రామాయమ్మా రావుగా రొసంగిరి. 7వ భాగ మీమాసాంతమున వెలువడఁగలదు.

**యా. వెం. సుబ్బదాసుఁడు.**

**చచ్చినవాఁడు మరల బ్రతుకుట.**

**ఒక ఆంగ్లేయ సైనికోద్యోగి యొక్క అపూర్వానుభవము.**

అరేబియా దేశమునందలి శోణసాగరము (Red Sea) మొదలు పరిషియన్ జలసంధివఱకు వ్యాపించిన విశాలమగు రాజ్యము నేలుచుండిన ఇబ్నాసుదు అనువారికి అతిథిగానుండి స్వదేశోన్ముఖుఁడైన కెప్తా హారోల్డు ఆరమ్స్ట్రాంగు (Captain Harold Armstrong) క్రింది వింతయైన సమాచారమును నుడివెను.

"నేను అచట నతిథిగా నుండినకాలమున నొకప్పుడు భయంకరమగు రక్తభేదులచేఁ బీడింపఁబడు చుంటిని, దేశీయ వైద్యులు పరీక్షించి గుండెలు కట్టుకొనుట ఆఁగిపోయిన దనిరి చచ్చితినని నిర్ధారించిరి. శవమును బూడ్చుటకుఁదగిన సన్నాహము చేయఁబడెను. నేను వాస్తవముగఁ జచ్చితిని. దేహమునువదలి నా యాత్మ వేఱుగ నున్నట్టుల నాకు గోచరించెను. నా చుట్టు ప్రక్క లనుండు వస్తువుల పరిజ్ఞానము నాకుఁ గలదు. కాని నాయాత్మ (Spirit) నా శరీరమును వదలినట్లు నాకుఁ బ్రత్యక్షముగాఁ గానవచ్చెను. ఇది అపూర్వా నుభవము. నేను జచ్చినతరువాత మఱి యిరువది నిమిషములకు మరలఁ బ్రాణములు గలవాఁడనైతిని. నేను దిరిగి యాలోకమునకు వచ్చుట కేహ్యపడితిని తిరిగి దేహమునఁ బ్రవేశించు నప్పటి బాధ యమితము, సుఖసంతోషముల కాటపట్టయిన నాలోకమునుండి తిరిగి దుఃఖామయ బహుళ మయిన

యాభౌతిక ప్రపంచమునకుఁ ద్రోసివేయఁబడితిని' ఏప్రిల్ 8వ తేది ప్రపంచవార్త (News of the world) అను పత్రిక వ్రాయచున్నదని 27-4-1934 హిందూపత్రిక ప్రకటించినది.

సత్యవచనములగు మనఋషులు వ్రాసిన విషయములు అసత్యములని నుడువు వివేకశూన్యులగు నాంగ్ల మానసపుత్రులీ దొరగారివార్తల కేమందురో? దీనివలనఁ బరలోకము గలదని దృఢపడుచున్నదిగదా ఇట్టివిషయములు మనవారి కపూర్వములుగావు కాని నేఁటికిఁ దెలివిమాలి, స్వవేష భాషా మత సంప్రదాయ ములు గంగలోఁగలిపి పరతంత్రులై దైవోపహితులైన మనవారిబుద్ధి పెడతలఁబట్టుట కంగలార్పవలసి యున్నది. ఈ ఆరమ్స్ట్రాంగు అనువారు మన దేశమునందును నుద్యోగము చేసియున్నారు.

**ప్రకృతి కుచేష్టలు.**

హిందూపత్రిక (12-5-34 శనివార) మిట్లు వ్రాయుచున్నది.

"క్రొత్తఢిల్లీ మేజస్ట్రీటుగారి యెదుటికొక మహరాష్ట్రుఁడు సక్రమమగు జీవనోపాయము లేదను కారణ మున గురువారమునఁ గొనిరాఁబడెను. వాఁడా న్యాయాధిపతితోఁ దనకుఁ బురుషాంగములును స్త్రీలకుఁ గల యవయవ ములను గలవని చెప్పెను. న్యాయస్థానమున నావిషయము ధ్రువ పఱుపఁబడి వాఁడచట నుండి వెడలి పోవుట కాజ్ఞాపింపఁబడెను. వాఁడు గర్భమును దాల్చి శస్త్రచికిత్సచేయఁబడి యొక శిశువు ను బ్రసవించినట్లు తెలుపఁబడెను."